# పంజరం

"అనలలా ఎగబడి పోవటమేమిటి అసహ్యంగా....ఇంటికొచ్చిన మనిషిని ఊపిరి తిప్పుకోనివ్వకుండా, నా బొమ్మలివిగో, నా పాటలివిగో— అని ప్రాణం తీయట మేనా....కాస్తయినా జ్ఞానం వుండద్దా. ఛీ....ఛీ...."

భాస్కరం చాలా చిరాకుపడిపోయాడు.

అరుణ తెల్లబోయింది.

"అదేమిటి, నువ్వు అవి బాగానే వుంటాయని చెపుతావుగా. పైగా అతను ఆర్టిస్ట్. అర్థంచేసుకుంటాడని ఆశపడ్డాను. అంత మాత్రానికేనా?...." అన్నది మొహం చిన్నబుచ్చుకొని.

"ఆహా—బ్రహ్మాండంగా అర్థం చేసుకొని నీ ఆధునిక కళాఖండాలకు టీకా టిప్పణి చెప్పాడుగా. అరే మనిషిని చూడగానే అంత పరవశం ఏమిటంట. గంటసేపు ఆ చెత్తంతా చూశాడు. నీ దిక్కుమాలిన పాటలు విన్నాడు. ఇకనైనా వాడిని వదిలి పెట్టి కొత్త కాఫీ ఇవ్వచ్చుగా.... అబ్బే....నా మోత నీ చెవిలో దూరిందా...."

పెయింటింగ్స్ సర్దుకొంటున్న అరుణ నిర్ఘాంతపోయి చూస్తోంది. భాస్కరం ఇలా మాటలాడడం కొత్త కాకపోయినా ఎప్పటికప్పుడు బాధగానే వుంటుంది. మాని పోతున్న గాయం కెలికినట్లు, రక్తం కారుతున్నట్లు వుంది. సమాధానం చెప్పేందుకు మాటలు దొరకలేదు. కాసేపు మెదలకుండా కూర్చుని గబగబా ఆ పెయింటింగ్స్ అన్నీ పెట్టెలో పడేసి మంచం కిందకి తోసేసింది. వయొలిన్ పెట్టెలోపడేసి దుప్పటి తీసేసి వంటింట్లోకి పారిపోయి వచ్చేసింది.

"కాఫీ తీసుకురా....వేడిగా తగలబెట్టు" అని ఓ కేక వేశాడు భాస్కరం.

అతనికి కాఫీ ఇచ్చేసి బయటికి వెళ్ళిపోతుంటే తలుపేసుకొని వంటింట్లోకి వచ్చిపడితే, చుట్టూ గిన్నెలు, గ్లాసులు, అలవాటైన డబ్బాలు, అరుగులు.... చుట్టూ చూశాక అదుర్దా కాస్త తగ్గింది. ఎప్పటిలా బాధో, కష్టమో వస్తే తీరికలేని పని పెట్టు కొని ఆ భారం తగ్గించుకొన్నట్టే వంటిల్లు సర్దటం మొదలుపెట్టింది. వణుకుతున్న చేతులు అదుపులో పెట్టుకొని గబగబా గిన్నెలు సర్ది, కడిగి,తుడిచి ముందుగదిలో సిగరెట్టు పీకలు ఎత్తిపోసి ఇల్లంతా అనవసరంగా కడిగి తళతళ మెరిసిపోతున్న గచ్చు మీద తన అడుగులు పడకుండా గోడవారగా నడుస్తూ వంటింట్లోకి వచ్చి ఓ నిమిషం నిలబడ్డాక అలసట అర్థం అయింది. వీరావేశంతోచేసిన పనితో-శారీరకంగా అలసిపోయాక, మానసికంగా ఆలోచించే ఓపిక పోయాక అప్పటికి స్థిమితపడింది అరుణ.

'ఇల్లెంత అద్దంలా వుంచుతుందో అరుణ'

'ఏ పిండివంట అయినా ఇట్టే నేర్చుకొంటుంది అరుణ'

'ఎంత పొందికో, ఏ చీర కట్టినా ఎంత అందమో'

'ఆ చేతులతో వెధవ చారు పెట్టినా కంచం తినెయ్యవచ్చు'

లాంటి మెప్పుకోళ్ళు వంటిమీద చెళ్ళుమని కంచీ దెబ్బల్లా తగులుతున్నాయి.

"అరుణా, ఇదిగో ఇద్దరికి టీ తీసుకురా"

"అరుణా ఇదిగో నలుగురు భోజనానికి వుంటారు. స్పెషల్స్ ఏం చేస్తావో సరుకులు ముందే తెప్పించుకో."

"ఇదిగో నా వైఫ్ అరుణ....నో.... నో. తనకి కాస్త సిగ్గు.... అంత యాక్టివ్ కాదు. తను ఎమ్మే చేసింది...."

ఇలాంటివే కదా భాస్కర్ చేసిన పరిచయాలు!

"అవును తను యాక్టివ్ కాదా...." ఓపిక చచ్చి వేడుకొన్న మనసు నిద్ర లేస్తోంది.

సంవత్సరాల తరబడి దీక్షగా చదివి సాధించిన ఫస్ట్‌క్లాస్ డిగ్రీ ఎక్కడో బీరువాలో చీరల మడతల్లో భద్రంగా నిద్రపోతోంది.

"నేను తెస్తున్న జీతంతో సర్దుకో హాయిగా వండుకుతిని సుఖంగా రెస్ట్ తీసుకో. నేను ఆఫీసు నుంచి వచ్చేసరికి హాయిగా నవ్వుతూ ఎదురుగా రా. వెధవ ఉద్యోగం కోసం అడ్డమైన వెధవలందరికీ "ఎస్ బాస్" వ్యవహారం చేయాలి. రాజా రాణీలా హాయిగా వుండు...."

అంటూ మల్లెపూలకి, తెల్లచీరెకి, వంటింటికి అంకితం చేస్తూ, భాస్కరం చేసిన మురిపాలు, కాళ్ళ జెర్రిలా వంటి మీద పాకినట్లు అనిపించి చీదరగా చేతులతో దులుపుకొంది అరుణ. ఏదో మళ్ళీ వంటిమీద పాకినట్లు వుంది, అరుణకు ఓ నిమిషం భయం వేసింది. తనకేం అవుతోంది. ఆ స్తబ్దం ఈ తలుపులు మూసిన ఏకాంతంలో తనొక్కతే.... "అనవసరంగా ఎవరి క్లాంపలకూ వెళ్ళటం ఎందుకూ" అనే ఆంక్షతో, కనీసం చుట్టుప్రక్కల వాళ్ళతోనైనా స్నేహం లేదు. వాళ్ళు మన సైం తింటారట, పోనీ....పోనీ అలాగే వుందాం. మరి అంతులేని తీరిక ఏం చేసుకోవాలి. ఉరకలు వేసే మనసుకి ఎలా పగ్గాలువేయాలి. మరిచిపోయిన రాగాలు జ్ఞాపకం చేసుకొని వయొలిన్ తీగలతో వరసలు కట్టి మనసులో వేదనని చల్లార్చుకొంది. రంగులు, కుంచెలతో నేస్తం కట్టాక కాస్త నెమ్మదించినట్లయింది. మళ్ళీ కొత్తకోరిక నిద్రలేచింది. తెల్లని కాన్వాస్ మీద కాసిన్ని గీతలతో తెల్ల గులాబీని సృష్టించాక దానిమీద పచ్చని ఆకులనీ, ఆకునుండి రాలిపడుతున్న మంచు ముత్యాన్ని చిత్రించాక ఆ అనుభూతి....పంచుకొనేందుకు సాటిమనిషి వద్దా?

ఈ ఎడారి గదిలో ఎవరా సాటి మనిషి? భాస్కరా? అవును. భాస్కర్ ఒక్కడే. అతను ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూసి, రాగానే గబగబా అతనికి ఇష్టమైనవన్నీ అమర్చిపెట్టి అతను రిలాక్స్ అయిన మొహం పెట్టాక అమ్మయ్య! అనుకొని గీసిన బొమ్మ చేతికి ఇచ్చి.

ఉదయం వేళ పొగమంచులో, కొమ్మ చివరన వుండే గులాబీ మొగ్గ అందం. అది నెమ్మదిగా రెక్కలు విప్పుతూ- రంగులు మార్చుతూ విచ్చుకొన్న వైనం.

మొగ్గ పువ్వయ్యాక, ఆ అనుభూతి గుండెలో చమరుస్తుంటే, దాన్ని గీతలతో కాన్వాస్‌మీద దింపితే అది తొలి యవ్వనంలోకి అడుగుపెట్టిన కన్నెగా ఎలా రూపు దిద్దుకొందో చెప్పాలని గుండెల్లోంచి ఉప్పెనలా వస్తున్న మాటల ప్రవాహవేగాన్ని అతనికి చెప్పేలోగానే,

"చాలా బావుంది

అని చెప్పేసి దాన్ని ప్రక్కన పడేసి అగ్గిపెట్టె తీసుకురా అని ఆర్డరు చేసే భాస్కరమ్మా త్మన భావాల్ని పంచుకోగలిగిన వ్యక్తి, ఒక దుఃఖాన్ని, వేగాన్ని, ఒక ఆహ్లాదస్పర్శని రాగంలోకి తెచ్చి మళ్ళీ మళ్ళీ విప్పి తన్మయత్వంతో దాన్ని భాస్కరం ముందు పలికిస్తే

"బాగా ఉంది"

అన్నా మళ్ళీ అదే రుచి తెలియని గొంతు. బతుకు రుచి తెలియని మనిషి తరువాత నెమ్మదిగా పరదాలన్నీ పోయాయి, ఎక్కడో అలజడి. ఇదంతా ఎవరితో నైనా చెప్పాలి. తను మాట్లాడగలిగినదంతా అర్థం చేసుకోగలిగిన స్నేహం కావాలి.

ఓ రోజు ప్రొద్దుట మూర్తి వచ్చాడు. భాస్కరం, అతనూ కబుర్లలోపడ్డారు. చుట్టూ రంగులన్నీ పేర్చుకొని నేల మీద అందమైన నెమలిని సృష్టించడంలో మునిగిపోయి వుంది అరుణ. మెరిసే పింఛం, ఏ రంగులో వస్తుందా అని రంగులు వెదుకుతుంటే

"ఆ ముదురాకు పచ్చ అంచుల్లో ఆ లేతాకుపచ్చ ట్రై చేయండి" అంటూ ఏదో సజషన్ ఇచ్చాడు మూర్తి. భాస్కరం తల తిప్పి చూసి.

"ఆవిడకు రంగుల పిచ్చి. ఇల్లు చూశావుగా సందు లేకుండా ఏదో ఒకటి గీసి పెట్టింది. ఇదిగో మూర్తి. ఇతనూ నీ జాతే. ఆర్టిస్ట్. రేపు ఆదివారం మెడికల్ క్లబ్‌లో ఇతని పెయింటింగ్స్ ఎగ్జిబిషన్ వుంది" అని పరిచయం చేశాడు.

మూర్తి లేచి వచ్చి నేలమీద పింఛం విప్పుకొన్న నెమలిని చూసి చాలా మెచ్చుకొన్నాడు. ఏ రంగు ఎక్కడ ఎలా కలిసిందో చెప్పుకొంది అరుణ. ఆ వరస అంతటితో ఆగలేదు. ఆదివారం పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కు వెళ్ళటం, ఆ తరువాత తను వేసిన ప్రతి చిత్రాన్ని మూర్తి చేతుల్లోకి తీసుకొని మెచ్చుకొనే వరకుపోయింది. ఇటు కొత్తరాగాల మేళవింపు, అటు కొత్త రంగులతో రూపకల్పన అతని మెచ్చు

కోలు కోసమే వేసినట్లయింది. మళ్ళీ జీవితంలో ఉత్సాహం వచ్చింది. కొత్త పెయిం టింగ్స్ ఎన్నో వేసేసింది అరుణ.

"రేపు ఎగ్జిబిషన్‌లో నీ పెయింటింగ్స్ కొన్ని పెడితే ఎలా వుంటుందా అని ఆలోచిస్తున్నా అరుణా. ఏవీ ఇలా తీసుకురా. కొన్ని సెలక్ట్ చేద్దాం" అని మూర్తి వచ్చాడు పొద్దుట. చుట్టూ పెయింటింగ్స్ పరుచుకొని కూర్చున్నారు. భాస్కరం నిద్రలేచి వచ్చేసరికి మామూలుగా అరుణ వంటింట్లో వుంటుంది. రేగిపోయిన జుట్టుతో, నలిగిన నైటీతో చెమటలు పట్టించుకొని వంటింట్లో వుండవలసిన అరుణ హాల్లో ఉత్సాహపు వెల్లువలో మునిగి తేలి వుంది. ఫ్రేములు ఎలా కట్టించాలో కొన్ని టికి ఫినిషింగ్ టచ్ ఇచ్చేసి ఎలా సిద్ధం చేయాలో చెపుతూ వుంటే శ్రద్ధగా నోట్ చేసుకొంటోంది. భాస్కరం ధుమ ధుమ లాడుతూ కూర్చున్నాడు.

"ఏమిటి మూర్తీ! ఈ చెత్తంతా పొద్దుటే పెట్టుకొని కూర్చున్నావు. ఇవాళ ఆఫీస్ లేదా"

అని విసుక్కొన్నాడు భాస్కరం. తన బాధ ఎవరికీ పట్టలేదని, టిఫిన్ లేకుండా మాడినందుకు, వేళకు వంట కాకపోవడం వల్లా తనకు ఎంత ఇబ్బంది అయిందో రెండు రోజులు సాధించాడు భాస్కరం.

ఎగ్జిబిషన్‌లో అరుణ పెయింటింగ్స్‌కి బాగానే గుర్తింపు వచ్చింది. దాదాపు అన్ని పేపర్లలో మంచి కవరేజ్ ఇచ్చారు. ఏకంగా ఓ పేరున్న పత్రిక వాళ్ళు ఆ పెయిం టింగ్‌ను కవర్ పేజీ వేశారు. పొద్దుటే ఆ ఎడిటర్‌గారు ఫోన్‌చేశారు. మీరు మా పత్రికలో బొమ్మలు వేయండి అని. మనసు గంతులు వేసింది. సొంతంగా తన టాలెంట్‌కి గుర్తింపు ఇది. భాస్కర్ చిరాగ్గా మొహం తిప్పుకొన్నాడు.

వంట చేస్తున్నా, ఇల్లు సర్దుతున్నా, అదే ఆలోచన. తను ఉద్యోగంచేయటం. చాలా మందితో స్నేహంగా కబుర్లు చెప్పుకోవటం. మనిషిగా తనకు గుర్తింపు. స్వేచ్ఛగా గాలిలో పల్టీలు కొడుతున్న పావురం కళ్ళముందు మాటి మాటికి మెది లింది. గబగబా చేతులు కడుక్కొని వచ్చి విశాలమైన కాన్వాస్‌మీద తేలుతున్న మబ్బులు, పచ్చని చెట్లు, హాయిగా స్వేచ్ఛగా ఎగిరే పక్షిని వేశాక మనసు తృప్తి పడింది.

భాస్కరం వస్తూ పూలు, పళ్ళూ తెచ్చాడు. సినిమాకు బయలుదేరదీశాడు. పూలు సింగారించుకొన్నా, సినిమాకు వెళ్ళినా ఇంటికొచ్చాక భోజనాలు చేసి మంచం

మీద చేరి భాస్కరంతో శృంగారం అంతా భరిస్తున్నా, మనసులో బెంగ తను ఉద్యోగంలో చేరుతోందా? లేదా? అదే యావ మనసులో.

"అన్నట్లు అరుణా నీకో గుడ్‌న్యూస్. మనం బెంగుళూరు వెళుతున్నాం. ఎప్పటి నుండో అడుగుతున్నావుగా ఎక్కడికన్నా వెళదామని. ఆఫీసులో సెలవు దొరికింది. హాయిగా పది రోజులు తిరిగి వద్దాం" అన్నాడు భాస్కరం మంచంమ్మీద విశ్రాంతిగా పడుకొని.

అరుణ గుండె కొట్టుకొంది.

"రేపు ఆఫీసుకు వెళ్ళడం లేదా నేనూ" అంది భయంగా.

"ఏం ఆఫీసూ" అన్నాడు భాస్కరం ఏమీ ఎరగనట్లు.

"ఆయన పొద్దుట ఫోన్ చేశాడుగా" అన్నది అరుణ.

భాస్కరం ఆవులించాడు.

"ఓహో అదా. నేను మరచిపోయాను. అదా....అ....వాళ్ళు పిలిచారనుకో మనకి కుదరొద్దూ. ఇంట్లో పనికీ, ఆఫీసుకీ ఎలా? మళ్ళీ పనిమనుషులు. వేళకు అన్నీ ఎలా కుదురుతుందీ....సుఖంగా వున్నాం. హాయిగా ఇంట్లో...." అతని మాటలకు మధ్యలో అడ్డుపడింది అరుణ.

"కాదండీ నేను వెళతా. ఇంట్లో పనంతా తెల్లవారుఝామున లేచి నేనే చూసుకొంటా" అంది గబగబా. భాస్కరం చిత్రంగా చూశాడు.

"బయటకు వెళ్ళే ఆడవాళ్ళ గతి ఎలాగుందో ఎరక్క అలా ఎగబడుతున్నావు. అసలు నీకీమధ్య అతి ఎక్కువయిందిలే. ఆ పిచ్చి బొమ్మలతో ఎలా నెగ్గుకు రాగలవు ఆఫీస్‌లో. అసలా ఆఫీస్‌లో నేనే ఓసారి ట్రైచేసి వదిలేశా. నీవల్ల ఏం అవుతుందీ" అన్నాడు తేలికగా.

"కాదండీ నేను చేస్తాను. నాకు సరదాగా వుంది మీకు ఇబ్బంది కలగనివ్వనుగా" అంది అరుణ.

"నోరు మూసుకొని పడుకో. నాకు ఇబ్బంది కలగనివ్వకుండా నువ్వు చేసేదేమిటి?" అసలు నీ వ్యవహారం శృతి మించుతోందని నాకు తెలుసు, ఆ మూర్తిగాడితో అంత పూసుకోవటం ఏమిటో, ఆ దిక్కుమాలిన రంగులేమిటో ఇదంతా పోనీలే అని ఊరుకుంటున్నా. ఒకళ్ళనసుకొని ఏంలాభం. నీకు బుద్ధి ఉండాలి. ఇంటికెవరన్నా రావటం భయం, వాడు ప్రాణం విసిగి పారిపోయేదాకా కబుర్లు చెప్పటం.

ఇంత సంస్కారం లేని మనిషిని నిన్నే చూశాను. ఇక నాచేత విసిగించకు. కాస్త మర్యాదగా బతకడం నేర్చుకో''

విసురుగా అటు తిరిగి పడుకొంటూ 'ఇక లైటు తీసి పడుకో' అని ఓ రంకె పెట్టాడు.

ఉలిక్కిపడి లేచి పరిగెత్తుకొని వెళ్ళి లైట్లు తీసేసింది అరుణ! చీకట్లో అలా కూర్చొంది. అంతేనా? తనునోరు మూసుకొని పడుకోవలసిందేనా. మనిషికి తిండి, నిద్ర వుంటే అన్నీ వున్నట్లేనా? తన మానసిక ప్రపంచం తలుపులు తీసే అవకాశం తనకు ఎప్పటికీ రాదా? మగాళ్ళతో కబుర్లు చెప్పటమేనా తన తాపత్రయం. స్వేచ్ఛగా ఎగిరే పక్షి మళ్ళీ రెక్కలు ముడుచుకొని పంజరంలోకి దీనంగా వెళ్ళిపోతున్న దృశ్యం కళ్ళముందు కనపడింది అరుణకు. లేచి లైటువేసి కాన్వాస్ వైపు చూసింది అరుణ.

నల్లని మిలమిలలాడే తెలివైన కళ్ళతో ఎగిరే పావురం. అరుణ పెదవుల మీదకు నవ్వు వచ్చింది. తన తాపత్రయం భాస్కరానికి ఎలా చెప్పాలో అర్థం అయింది. టేబుల్ దగ్గర కూర్చొని తెల్ల కాగితాలు ముందేసుకొంది. అక్షరాల వరుసలు పేరుస్తున్నకొద్దీ మనసులో ఆవేదన తీరినట్లయింది. భాస్కరం వెళ్ళిపోయాక తన ఏకాంతం, స్నేహం కోసం తనుపడ్డ తపన అన్నీ రాసుకుపోతోంది.

....తలుపులుతెరచి నువ్వు బయటప్రపంచంలోకి అడుగుపెడతావు భాస్కరం మరి నేను నువ్వు వెళ్ళిపోయాక నాకు దొరికిన ఏకాంతంలో విసిగి వేసారిపోయాను. అనాది నుండి మనిషి ఏ భావ ప్రకటనకోసం తాపత్రయ పడ్డాడో, భాషఅనేది ఎందుకు పుట్టిందో అర్థం అయితే నీకు నా వేదన అర్థం అయ్యేది. నేను బొమ్మలు గీసింది రాగాలు పలికించింది అందుకే. నాకు నేను తోడు. నాకు నేనే స్నేహితురాలిని, ఈ మానసిక ప్రపంచంలో నన్ను నేనే తోడు చేసుకొన్నా. నాకు శబ్దం కావాలి. నాకు చైతన్యం కావాలి. స్నేహం కావాలి. ఈ మృత్యు శీతల స్పర్శ నన్ను అంతం చేయకముందే నేను బ్రతికే అవకాశం ఇవ్వు భాస్కరం. నాకు రెక్కలు ఇవ్వు. నేను ఎగబడింది; అతిగా ప్రవర్తించింది ఇందుకే. జీవ చైతన్యం కోసం, మనుష్యుల కోసం, నా ఉనికి గుర్తింపు కోసం....

అరుణ కళ్ళు మూతలు పడ్డాయి. టేబుల్‌మీద అలాగే తలవాల్చి కళ్ళుమూసుకొంది. రెక్కలు అల్లాడిస్తూ రంగు రంగుల పక్షులు... నీలాకాశంలో స్వేచ్ఛగా హాయిగా ఎగురుతూ కనిపించాయి అరుణకు కలలో!

*

(ఆదివారం ఆంధ్రజ్యోతి)